క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



సీఐగా బాధ్యతలు చేపట్టిన ఇబ్రహీం

కడప అర్బన్: కడప టూటౌన్ అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ సీఐగా జి. ఇబ్రహీం శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కర్నూలు జిల్లా బనగాన పల్లెకు చెందిన ఇబ్రహీం 2009 బ్యాచ్‌లో ఎస్ఐగా పోలీసుశాఖలో ఉద్యోగంలో చేరారు. జిల్లా లోని ప్రొద్దుటూరు టూటౌన్ ఎస్ఐగా విధుల్లో చేరారు. ఆయన పలు పోలీస్ స్టేషన్‌లలో ఎస్ఐగా పని చేశారు. 2021లో సీఐగా పదోన్నతి పొందిన జి. ఇబ్రహీం కర్నూలు సీఐడిలో ఏడాదిపాటు పనిచేశారు. తరువాత ప్రొద్దుటూరు టూటౌన్ సీఐగా పనిచేస్తుండగా, కడప టూ టౌన్ సీఐగా బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో కృషి చేస్తామన్నారు.

ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ట్యాలీ కోర్సులో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఫౌండేషన్ అడ్మిషన్ కో ఆర్డినేటర్ హరిప్రసాద్ తెలిపారు. అభ్యర్థులు టెన్త్ పాస్, ఇంటర్మీడియేట్, డిప్లొమా, డిగ్రీ పాస్/ఫెయిల్ అయిన వారు అర్హులన్నారు. అలాగే 18–26 సంవత్సరాల వరకు వయస్సు కలిగి ఉండాలన్నారు. బెంగుళూరులో 35 రోజులపాటు ఇచ్చే శిక్షణలో భోజన, వసతి సౌకర్యం కల్పిస్తారన్నారు. వివరాలకు 90004 87423 సంప్రదించాలన్నారు.

డైరీ ఆవిష్కరణ



ఆల్ మేవా ఉద్యోగులతో కలిసి డైరీని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం అంజాద్‌బాష

కడప ఎడ్యుకేషన్: ఆల్ మైనారిటీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏపీ అమరావతి డైరీని శుక్రవారం డిప్యూటీ సీఎం అంజాద్‌బాష తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ డైరీ ఉద్యోగులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఫరూక్, వైఎస్సార్ జిల్లా ఆల్‌మేవా అధ్యక్షుడు పీఎం జలీల్‌ఖాన్, సెక్రటరీ నజీర్‌బాష, ఏపీ ఎన్‌జీవో కడప అధ్యక్షుడు శ్రీనివాసులు, సెక్రటరీ రవికుమార్‌తోపాటు ఆల్ మేవా జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ఖేలో ఇండియా పోటీల్లో వైవీయూకు మరో పతకం



రజత పతకం సాధించిన రాజశేఖర్

వైవీయూ: అరుణాచల్ ప్రదేశ్ రాజధాని ఈటా నగర్‌లో నిర్వహిస్తున్న ఖేలో ఇండియా విశ్వవిద్యాలయ క్రీడాపోటీల్లో వైవీయూకు రెండో పతకం లభించింది. విశ్వవిద్యాలయం పరిధిలోని కమలాపురం సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ కళాశాలలో బీఏ ప్రథమ సంవత్సరం చదువుతున్న జి. రాజశేఖర్ వెయిట్‌లిఫ్టింగ్‌లో పతకం సాధించాడు. వెయిట్ లిఫ్టింగ్ పురుషుల 109 కేజీల విభాగంలో పోటీపడిన ఈయన స్నాచ్ విభాగంలో 125 కేజీలు, క్లీన్ అండ్ జర్క్ విభాగంలో 160 కేజీలు మొత్తం 285 కేజీలు బరువు ఎత్తి రెండోస్థానంలో నిలిచి రజతపతకం సాధించాడు. ఈ సందర్భంగా వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, క్రీడాబోర్డు కార్యదర్శి డా. కె. రామసుబ్బారెడ్డి ఆయన్ను అభినందించారు.

వికసిత్ భారత్ పోటీల్లో కడప విద్యార్థుల ప్రతిభ

వైవీయూ : భారత ప్రభుత్వం, యువజన వ్యవహారాలు, క్రీడామంత్రిత్వశాఖ, నెహ్రూ యువ కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో గుంటూరులో నిర్వహించిన ×మై భారత్ – వికసిత్ భారత్¤ ఉపన్యాస పోటీల్లో జిల్లా విద్యార్థినులు బహుమతులు పొందారు. కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన సయ్యద్ సానియా, ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి చెందిన వెన్నెల ఉపన్యాస పోటీల్లో తృతీయస్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా వీరికి నిర్వాహకులు ప్రశంసాపత్రాలను అందజేశారు. వీరిని నెహ్రూ యువకేంద్రం జిల్లా అధికారి మణికంఠ అభినందించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

– డిప్యూటీ సీఎం ఎస్.బి.అంజాద్ బాషా



ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ బాష అన్నారు. శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆర్.కె.నగర్ ప్రాంతంలో పలు వీధులు, ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం పేద ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏవిధంగా ప్రజలకు చేరుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వారికి వివరించి, వారు పొందుతున్న లబ్ది సమాచారంతో కూడిన బుక్ లెట్‌ను అందజేశారు.

- ఈ సందర్భంగా భూసంద్ర ప్రభా అనే మహిళ మాట్లాడుతూ జగనన్న ఇంటి స్థలం, నిర్మాణానికి నగదు, జగనన్న అమ్మ ఒడి, వైఎస్ఆర్ ఆసరా పథకాల ద్వారా రూ. 8,77,904 లబ్ది పొందామని, ఈ ప్రభుత్వానికి ఎల్లప్పుడూ బాసటగా ఉంటామని ఆనందం వ్యక్తం చేసింది.
- గాలి లక్ష్మీదేవి అనే మహిళ మాట్లాడుతూ వైఎస్ఆర్ సున్నా వడ్డీ, వైఎస్ఆర్ రైతు భరోసా, వైఎస్ఆర్ సున్నా వడ్డీ, వైఎస్ ఆర్ ఆసరా, జగనన్న అమ్మ ఒడి వంటి పథకాల ద్వారా రూ. 1,35,966 లబ్ది చేకూరిందని, దీంతో మా కుటుంబం అంతా సంతోషంగా ఉన్నామని తెలిపింది.
- ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్‌కుమార్, 4వ డివిజన్ ఇంచార్జి ఆర్.వి. రమణ, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్. సుబ్బారెడ్డి, తోట కృష్ణ, షఫీ, నారాయణమ్మ, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రైతాంగ సమస్యలను పరిష్కరించాలి



జ్యోతిరావు పూలే సర్కిల్‌లో నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతాంగ సమస్యలను పరిష్కరించాలని సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు చంద్రశేఖర్, చంద్ర పేర్కొన్నారు. శుక్రవారం ఢిల్లీ రైతు ఉద్యమంలో అమరుడైన శంబోకరణ్ సింగ్ మృతికి నిరసనగా నగరంలోని పాతబస్టాండు వద్ద నున్న జ్యోతిరావు పూలే సర్కిల్‌లో వామపక్ష పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీపీఎం, సీపీఐ నాయకులు ఎల్ .నాగ సుబ్బారెడ్డి, బాదుల్లా, వెంకట శివ, భాగ్యమ్మ , మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ, సీఐటీయూసీ ఆధ్వర్యంలో....

బీజేపీ ప్రభుత్వ వైఖరిని ఎండగడుతూ శుక్రవారం ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో నగరంలోని కడప ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు నాగసుబ్బారెడ్డి, బాదుల్లా, శ్రీనివాసులు రెడ్డి, దస్తగిరి రెడ్డి, అన్వేష్, ఉద్దె మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

'భారతి' సిమెంట్‌తో పటిష్టమైన కట్టడాలు



తాపీ మేస్త్రీకి బీమా బాండును అందజేస్తున్న భారతి సిమెంట్ కంపెనీ టెక్నికల్ మేనేజర్ నాగేంద్ర

కడప కల్చరల్ : భారతి సిమెంటు ద్వారా పటిష్టమైన, అత్యుత్తమైన కట్టడాలను నిర్మించవచ్చని ఆ కంపెనీ టెక్నికల్ మేనేజర్ కె.నాగేంద్ర పేర్కొన్నారు. శుక్రవారం కడప నగర పరిధిలోని పులివెందుల రింగ్‌రోడ్డులోగల శరణ్య ట్రేడర్స్‌లో తాపీ మేస్త్రీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిమెంట్ రోబొటిక్ టెక్నాలజీతో ఈ సిమెంటును రూపొందిస్తున్నట్లు తెలిపారు. భారతి అల్ట్రా ఫాస్ట్ సిమెంటు గురించి ఆయన వివరించారు. ఇది శ్లాబ్ వేసేందుకు ఎంతో అనుకూలమైన, పటిష్టమైన సిమెంటు అని తెలిపారు. పర్యావరణానికి కూడా అనుకూలమైనదన్నారు. ఈ సందర్భంగా ఆయన తాపీ మేస్త్రీలకు రూ. లక్ష ఉచిత ప్రమాద బీమా బాండులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సేల్స్ మేనేజర్ శ్రీనివాసులు, డీలర్ శశికుమార్‌రెడ్డి, తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.

గ్రామీణ బ్యాంకు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ఏపీజీబీ చైర్మన్ రాకేష్ కశ్యప్‌కు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న ఏపీజీబీ అధికారులు, ఉద్యోగులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : గ్రామీణ బ్యాంకు ఉద్యోగుల అపరిష్కృత సమస్యలను యాజమాన్యాలు సత్వరమే పరిష్కరించాలని అఖిల భారత ప్రాంతీయ గ్రామీణ బ్యాంకు ఉద్యోగుల సంఘం నాయకులు, అధ్యక్షులు హరి ప్రసన్న కుమార్ డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు అధికారుల సంఘం, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ఉద్యోగుల సంఘం సంయుక్తంగా శుక్రవారం సమ్మెలో పాల్గొన్నాయి. అందులో భాగంగా కడపలోని బ్యాంకు ప్రధాన కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా హరిప్రసన్న కుమార్, అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ రెడ్డి , ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి మొహమ్మద్, ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సురేష్ , రిటైరీస్ ప్రధాన కార్యదర్శి కె వి సుబ్బా రెడ్డి మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏపీజీబీ చైర్మన్ రాకేష్ కశ్యప్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ అధికారులు, ఉద్యోగులు, తాత్కాలిక ఉద్యోగులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజారోహణం



ధ్వజారోహణం చేస్తున్న అర్చకులు

కడప కల్చరల్: కడప నగరం బిల్టప్ వద్దగల జగన్మాత శ్రీ విజయదుర్గాదేవి 22వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. అందులో భాగంగా శుక్రవారం ఉదయం 4.30 గంటలకు అమ్మవారి మూల విరాట్‌కు ఆలయ నిర్వాహకులు దుర్గాప్రసాద్ దంపతులు విశేష పూజలు చేసి పట్టు వస్త్రాలు, ఆభరణాలు సమర్పించారు. అర్చకుల వేద మంత్రాల మధ్య శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకం, అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా సకల దేవతలను ఈ ఉత్సవాలకు ఆహ్వానిస్తూ అమ్మవారి సింహ వాహన చిత్రం గల పతాకాన్ని ధ్వజ స్తంభంపై ప్రతిష్ఠించారు. శుక్రవారం కావడంతో ప్రత్యేకంగా సుమంగళి పూజలు కూడా నిర్వహించారు. రాత్రి శ్రీ విజయదుర్గ, మల్లికార్జునుల ఉత్సవ మూర్తులను సింహ వాహనంపై కొలువుదీర్చి ఆలయ ప్రదక్షిణ నిర్వహింపజేశారు.

నిరుద్యోగ యువతకు ఉత్తమ శిక్షణ ఇవ్వాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : నిరుద్యోగ యువతీ యువకులు జీవితంలో స్థిరపడేందుకు వివిధ అంశాల్లో ఉత్తమ శిక్షణ ఇవ్వాలని అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సూచించారు. శుక్రవారం అసిస్టెంట్ కలెక్టర్ నగర శివార్లలోని కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థను పరిశీలించారు. అక్కడ ఇస్తున్న శిక్షణ కార్యక్రమాలను గురించి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ శిక్షణ పూర్తి చేసుకున్నాక ఆయా రంగాల్లో రాణించేందుకు అన్ని విధాల తోడ్పాటు అందించాలన్నారు. అవసరం మేర పెట్టుబడి కింద బ్యాంకుల ద్వారా రుణ మంజూరుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శిక్షణా సంస్థ డైరెక్టర్ నారాయణ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కడప కార్పొరేషన్ : కడపలోని 220 కేవీ సబ్‌స్టేషన్‌లో జరుగుతున్న మరమ్మతుల కారణంగా కార్పొరేషన్ పరిధిలో శనివారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు, చింతకొమ్మదిన్నె, వల్లూరు, చెన్నూరు , పెండ్లిమర్రి మండలాల పరిధిలో ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని కడప డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ యల్.నరసింహ ప్రసాద్ తెలిపారు. ఈ విషయంగా ప్రజలు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని సూచించారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి



మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్

కడప ఎడ్యుకేషన్: పర్యావరణాన్ని ప్రతి ఒక్కరూ పరిరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మను పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అబ్దుల్ ముఖీత్‌ఖాన్ అన్నారు. కడప నగర శివార్లలోని మను పాలిటెక్నిక్ కళాశాల తరుపున కడప ఇందిరానగర్‌లోని మండల పరిషత్తు ఉర్దూ ప్రాథమిక పాఠశాలల్లో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపులో భాగంగా శుక్రవారం పాఠశాల ఆవరణంలో మొక్కలను నాటే కార్యక్రమన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పోగ్రాం కోఆర్డినేటర్ మొహమ్మద్ ఖాజా, మోయినుద్దీన్, పోగ్రాం ఆఫీసర్స్ మోహమ్మద్ సికిందర్ హుస్సేన్, ఖాజాఫీర్, ఆయాజుద్దీన్, స్కూల్ హెచ్ఎం మహబూబ్‌ఖాన్ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

కడప కార్పొరేషన్ : విద్యుత్ సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చూడాలని విద్యుత్‌శాఖ ఎస్ఈ రమణ సూచించారు. శుక్రవారం ఆయన కడపలోని విద్యుత్ వినియోగదారుల సేవా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త సర్వీసులు, ఇతర సేవల కోసం ప్రజలు నమోదు చేసుకున్న తర్వాత సంస్థ నిర్దేశించిన కాల వ్యవధిలో సమస్య పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. వినియోగదారులు విద్యుత్ సమస్యలపై వచ్చినప్పుడు వారితో మమేకమై సమస్యలను విని పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ఎస్ఈ విడుదల చేసిన కొత్త సర్వీసులను పరిశీలించి స్వయంగా వినియోగదారులకు ఫోన్ చేసి సంస్థ అందించిన సేవలు గురించి తెలుసుకున్నారు.

రాయల్ రషీద్ సేవలు చిరస్మరణీయం

కడప ఎడ్యుకేషన్: రాయల్ రషీద్ ఫొటోగ్రాఫర్‌గా సమాచారం పత్రికలకు అందచేసిన సేవలు చిరస్మరణీయం అని రాష్ట్రపతి అవార్డు గ్రహీత విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావు పేర్కొన్నారు. శుక్రవారం పాత కలెక్టరేట్ వద్ద ఉన్న పెన్షనర్ల సంఘం కార్యాలయంలో సీనియర్ ఫ్రీలాన్స్ ఫొటోగ్రాఫర్ కమ్ జర్నలిస్టు రాయల్ రషీద్ జీవిత చరిత్ర పుస్తకాన్ని గానుగపెంట హనమంతరావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వ విశ్రాంతి ఉద్యోగుల సంఘం అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ రాధాకృష్ణ, జిల్లా జాయింట్ సెక్రటరీ నాగరత్నచారి తదితరులు పాల్గొన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్ల సమస్యలను పరిష్కరించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లాలో మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్లకు ఇచ్చిన నోటీసులపై పునరాలోచించి వారి సమస్యలను పరిష్కరించాలని డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి ఓబులేసు పేర్కొన్నారు. శుక్రవారం మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా వైద్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నగర అధ్యక్షుడు చంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాల విద్యార్థులకు అభినందన

వైవీయూ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలకు చెందిన విద్యార్థులు జాతీయస్థాయి సెమినార్‌లో పరిశోధన పత్రాలు సమర్పించడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ శుక్రవారం అభినందించారు. బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న మహేశ్వరి, వసుంధర, శోభారాణిలు, నాల్గవ సంవత్సరం చదువుతున్న శ్వేత, వేణు, ఆంజనేయులు నాయక్‌లు కోయంబత్తూరులో నిర్వహించిన ఐసీఎస్ఎస్ఆర్ సెమినార్‌లో పరిశోధన పత్రాలు సమర్పించడం పట్ల వారు సంతోషం వ్యక్తం చేశారు.

కడపలో విగ్రహాల ఏర్పాటుకు కృషి

కడప సెవెన్‌రోడ్స్ : కడప నగరంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, బుడ్డా వెంగళరెడ్డి విగ్రహాల ఏర్పాటుకు కృషి చేస్తామని రేనాటి సూర్యచంద్రుల స్మారక సమితి అధ్యక్షులు, నంద్యాల పార్లమెంటు సభ్యులు పోచా బ్రహ్మానందరెడ్డి హామీ ఇచ్చారు. వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షులు తవ్వా వెంకటయ్య, సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు భూతపురి గోపాలకృష్ణశాస్త్రి శుక్రవారం ఎంపీని కలిసి కడపలో విగ్రహాల ఏర్పాటుకు సహకరించాలని కోరారు.

కబడ్డీలో జిల్లా జట్టుకు మూడోస్థానం

కడప స్పోర్ట్స్: ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో నిర్వహించిన 33వ సబ్‌జూనియర్ రాష్ట్రస్థాయి బాలబాలికల కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీల్లో వైఎస్ఆర్ కడప జిల్లా బాలుర జట్టు మూడోస్థానంలో నిలిచింది. జిల్లా జట్టుకు రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు చేతుల మీదుగా ట్రోఫీ, మెడల్స్ అందజేశారు. జిల్లా క్రీడాకారులు చక్కటి ఆటతీరును కనబరిచి తృతీయస్థానం కైవసం చేసుకోవడం పట్ల జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఓ. రవీంద్రారెడ్డి, ఆర్. వెంకటసుబ్బయ్య, కబడ్డీ శిక్షకుడు ఆర్.వి. శ్రీధర్ హర్షం వ్యక్తం చేశారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి



ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్: నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను సత్వరం పూర్తి చేయాలని నగరపాలక కమిషనర్ జీఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ అన్నారు. శుక్రవారం నూతనంగా నిర్మిస్తున్న గాంధీ ప్లాజా, ఈట్ స్ట్రీట్, అక్కాయపల్లె పార్క్, స్కేటింగ్ రింగ్, గ్యాలరీ, అన్నమయ్య జంక్షన్ నుండి సంజన సర్కిల్ వరకూ ఉన్న ప్రాంతాలను ఆయన పరిశీలించారు. గాంధీ ప్లాజా వద్ద పనులు వేగవంతం చేయాలని, పార్కును సందర్శించే ప్రజలకు సీటింగ్ ఏర్పాటు చేయాలని, ప్రతి చోటా మొక్కలు నాటించాలన్నారు. ఈట్ స్ట్రీట్‌లో ఫౌంటెన్ ఏర్పాటు చేసి, చుట్టూ గ్రీన్ గ్రాస్ ఏర్పాటు చేయాలన్నారు. అక్కాయపల్లె పార్కులో మొక్కలు నాటించాలని సూచించారు. మునిసిపల్ స్టేడియం వద్ద నిర్మిస్తున్న స్కేటింగ్ రింగ్, గ్యాలరీ పనులు డిజైన్ ప్రకారం పూర్తి చేయాలన్నారు. మున్సిపల్ స్టేడియం చుట్టూ గ్యాలరీ పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్ఈ రత్నాల రాజు, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి పాతరేస్తున్న ఈవీఎంలు

– సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది భాను ప్రతాప్ సింగ్



మాట్లాడుతున్న భాను ప్రతాప్ సింగ్

కడప కోటిరెడ్డిసర్కిల్: కేంద్రంలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సార్వత్రిక ఎన్నికల్లో ఈవీఎంల ద్వారా గెలిచి ప్రజాస్వామ్యానికి పాతరేస్తున్నట్లు సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది భాను ప్రతాప్ సింగ్ ఆరోపించారు. సౌత్ ఇండియా ఇండియన్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం కడప రవీంద్రనగర్ లోని యూఎస్ మహల్ లో ఈవీఎం హటావో దేశ్ బచావో సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తక్షణమే కేంద్ర ఎన్నికల సంఘం స్పందించి రానున్న ఎన్నికలను ఈవీఎంల ద్వారా కాకుండా బ్యాలెట్ పేపర్ ద్వారా జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ బోర్డు కన్వీనర్ జహీరుద్దీన్ హుస్సేన్ కో కన్వీనర్ సయ్యద్ సలావుద్దీన్, నాయకులు అమీర్ బాబు, నజీర్ అహ్మద్, అలీ ఖాన్, కేసి బాదుల్లా, ఫాదర్లు మోహన్ బాబు, హిల్సన్ ముస్లింలు పాల్గొన్నారు.